క్లుప్తంగా

యారా గురునాథస్వామి గ్రామోత్సవం ప్రారంభం



ఊరేగుతున్న యారా గురునాథస్వామి

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరులో ఉన్న యారా గురునాథస్వామి గ్రామోత్సవం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ముత్యాలమ్మ ఆలయానికి అనుబంధంగా ఉన్న యారా గురునాథస్వామి ఆలయంలో ఏటా సంక్రాంతి చివరి రోజున ప్రారంభమయ్యే స్వామివారి గ్రామోత్సవం 4 రోజుల పాటు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పంచాయతీలోని తూర్పుకనుపూరు, ఈదులవారిపాళెం, కొమరావారిపాళెం, రావులవారిపాళెం, పోసినవారిపాళెం గ్రామాల్లో ఉత్సవం సాగుతుంది. ప్రతి గ్రామంలో స్వామివారికి ఇంటింటా పూజలు చేసి, పొంగళ్లు పెట్టి, మొక్కులు చెల్లిస్తారు. గ్రామోత్సవాన్ని ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

ముత్యాలమ్మకు వెండి నవహారతి పళ్లెం బహూకరణ



దాతల నుంచి నవ హారతి పళ్లెం అందుకుంటున్న మురళీమోహన్‌రెడ్డి

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరులో ఉన్న ముత్యాలమ్మకు పలువురు దాతలు వెండితో తయారు చేసిన నవహారతి పళ్లేన్ని బుధవారం బహూకరించారు. అమ్మవారి ఆలయ మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ వేమారెడ్డి మురళీమోహన్ రెడ్డి దాతల ద్వారా సేకరించిన 1.03 కిలోల వెండి నవ హారతి పళ్లేనికి ఆలయంలో పూజలు చేసి, ఈఓ నవీన్‌కుమార్‌కు అందజేశారు. మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాభివృద్ధితోపాటు అమ్మవారికి భక్తులు తమకు తోచిన విధంగా కానుకలు సమర్పిస్తున్నారన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి



ఆర్డీఓను సత్కరిస్తున్న వెంకటరమణయ్య

గూడూరు: ఎస్సీఎస్టీల సమస్యల పరిష్కారానికి తనవంతు పనిచేసి, వారి అభ్యున్నతికి కృషి చేస్తానని జిల్లా అట్రాసిటీ కమిటీ సభ్యుడు నన్నూరు వెంకటరమణయ్య అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన బుధవారం ఆర్డీఓ కిరణ్‌కుమార్‌ను కలిశారు. ఆర్డీఓను శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట సూళ్లూరు కృష్ణయ్య, సురేష్, ఎం కోటేశ్వరరావు తదితరులున్నారు.

పూరిల్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

చిల్లకూరు: మండలంలోని వరగలిలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్గం అయ్యింది. స్థానికులు కథనం మేరకు.. గ్రామానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి, మంటలు అంటుకున్నాయి. స్థానికులు గుర్తించి లింగవరం సమీపంలోని మీనాక్షి పవర్ ప్రాజెక్ట్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడ నుంచి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇల్లు కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 50 వేలు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

అభివృద్ధి..సంక్షేమమే రెండు కళ్లుగా పాలన



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్: సీఎం జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని సుపరిపాలన సాగిస్తున్నందునే ధైర్యంగా ప్రజల ముంగిటకు వెళుతున్నామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. చైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి సారథ్యంలో బుధవారం బీఎంఆర్ నగర్, భూపయ్య కాలనీ సచివాలయాల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎల్ఏసాగరం అగ్రహారపేట వద్ద ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, నాయకులకు శాలువలు కప్పి, గజ మాలలతో సత్కారించి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వారు లబ్ధి పొందిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. పలువురు పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆయన అధికారులతో మాట్లాడి, వాటిని పరిష్కారించేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ టీ సుబ్రహ్మణ్యంరెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే వెంకటరమణారెడ్డి, నాయకులు కే రాజారెడ్డి, బీ మల్లికార్జునరెడ్డి, కే జయరామయ్య, వీ లక్ష్మీనారాయణరెడ్డి, డీ రవి, కిషోర్ యాదవ్, పీ రాజేష్, కే చెంచయ్య, మునుస్వామి నాయుడు, ఎన్సీఆర్, జీ సిద్ధయ్య, సీ కుమార్, మెస్ భాస్కర్‌రెడ్డి, చంద్రారెడ్డి, ఎం లక్ష్మీనారాయణ, పీ హరిరెడ్డి, ,రాహుల్, ఏ బాబు, వెంకటేశ్వర్లు, రహమతూల్లా, కౌన్సిలర్లు కే అశోక్ కుమార్, పీ నాగార్జున పాల్గొన్నారు.

జగనన్న సీఎంగా ఉంటేనే పేదలకు మేలు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుంటేనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని, అన్ని వర్గాల వారు ఆశీస్సులు అందించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం ఏటి పండుగ ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించేలా ఎనలేని కృషి చేస్తున్న సీఎంకు అందరం రుణపడి ఉండాలన్నారు. ఏటిపండుగ ఘనంగా నిర్వహించేందుకు చైర్‌పర్సన్ కటకం దీపిక, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నేతలు, దాతలు ఎంతో తోడ్పాటు అందించారన్నారు. సాంస్కృతిక కార్య క్రమాల నిర్వహణకు సినీ ఈవెంట్ నిర్వాహకులు హరి అభినందనీయుడని ఎమ్మెల్యే కొనియాడారు.

పేదల జీవితాల్లో వెలుగులు



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

- ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

చిల్లకూరు: రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని వరగలి సచివాలయం పరిధిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ఆ ఇంటి యజమానులకు ప్రభుత్వం ఎంత మేర లబ్ధి చేకూర్చిందనే విషయాలను తెలియజేసి, బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా ప్రతి పేదవాడికి ఆర్థిక భరోసా కల్పించేలా పథకాలను రూపొందించి, వాటిని అమలు చేసేందుకు క్షేత్ర స్థాయిలోనే సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసారన్నారు. సచివాలయాల ద్వారా వేల ఉద్యోగాలిచ్చి ఎన్నో పేదల కుటుంబాలలో వెలుగులు నింపారని తెలిపారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి, వాటిని పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మత్స్యకారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య, వైస్ ఎంపీపీ కుమారస్వామిరెడ్డి, సర్పంచ్ మాధవి, ఎంపీటీసీ సభ్యులు కోటేశ్వరరావు, జానకిరామ్, ఏఎంసీ మాజీ చైర్మన్ జానకిరామ్‌రెడ్డి, నాయకులు శివకుమార్, సతీష్, ఎంపీడీఓ విష్ణుచిరంజీవి పాల్గొన్నారు.

వెంకటగిరిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం



వైఎస్సార్‌సీపీ కార్యాలయం నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌బోర్డు చైర్మన్ నేదురుమల్లి

వెంకటగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అభివృద్ధిలో వెంకటగిరిని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌బోర్డు చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కౌన్సిలర్‌లు, అధికారులతో సమావేశం నిర్వహించారు.

రెండు నెలల్లో వైఎస్సార్ సీపీ కార్యాలయం పూర్తి

వెంకటగిరి వైఎస్సార్ సీపీ కార్యాలయ నిర్మాణం రెండు నెలల్లో పూర్తి చేసి అందరికీ అందుబాటులోకి తీసుకువస్తామని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నేదురుమల్లి నివాసం ఆవరణలో నూతన పార్టీ కార్యాలయ నిర్మాణ పనులకు ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర, ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన భూమిపూజ చేశారు. అందరికీ అందుబాటులో ఉండేలా నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం హర్షణీయమని ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సంగీత, నృత్య అకాడమి చైర్‌పర్సన్ పాట్లేళ్ల శిరీష, నెల్లూరు జిల్లా గ్రంథలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద, పార్టీ నేతలు చెలికం శంకరరెడ్డి, పాపకన్ను మధురెడ్డి, నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, పులి ప్రసాద్‌రెడ్డి, చిట్టేటి హరికృష్ణ, తోట గణేష్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పి దశరథ రామిరెడ్డి, వి కార్తీక్‌రెడ్డి, నాగ య్య, వేణునాయుడు, కౌన్సిలర్‌లు వహీదా యస్థానీ, కె కృష్ణమూర్తి, సుబ్బారావు, కె మల్లీశ్వరి, సుభావళి, బాలాయపల్లె ఎంపీపీ జి భాస్కర్‌రెడ్డి, వక్ఫ్‌బో ర్డు జిల్లా డైరక్టర్ పి తాజుద్దీన్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్సీ కల్యాణ చక్రవర్తి

గూడూరు: క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం చేకూరుతుందని ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి పేర్కొన్నారు. స్థానిక ఆదిశేషారెడ్డి స్టేడియంలో బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంతో మీడియాతోపాటు పలు శాఖల ఉద్యోగులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. బుధవారం రాత్రి జరిగిన బహుమతుల ప్రదానోతవానికి ఎమ్మెల్సీ కల్యాణచక్రవర్తి హాజరయ్యారు. ఆర్డీఓ కిరణ్‌కుమార్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, కమిషనర్ సాయినాథ్ పాల్గొన్నారు.

మండలమ్మకు పొంగళ్లు



అమ్మవారికి పొంగళ్లు పెడుతున్న మహిళలు



పొంగళ్లు ఆలయంలోకి తీసుకువెళుతున్న భక్తులు

చిల్లకూరు: మండలంలోని ఏరూరు గ్రామదేవత మండలమ్మకు బుధవారం గ్రామస్తులు సామూహికంగా పొంగళ్లు పెట్టి, మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా సంక్రాంతి సందర్భంగా గ్రామస్తులు పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. గ్రామంలోని మహిళలు సామూహికంగా మేళ తాళాల నడుమ సామగ్రితో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు సామూహిక పొంగళ్లు పెట్టి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. రాత్రి అమ్మవారికి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

ఓసూరమ్మకు ప్రత్యేక పూజలు

సైదాపురం: మండలంలోని మొలకలపూండ్ల గ్రామంలో గ్రామదేవత ఓసూరమ్మ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకమార్చన చేశారు. అనంతరం సుగంధ భరిత పుష్పాలతో అమ్మవారికి విశేషాలంకరణ చేసి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.

కమనీయం.. చెన్నకేశవస్వామి కల్యాణం

పెళ్లకూరు: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి పూజ, అభిషేక పూజలు, హోమాలు జరిపారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. తరువాత స్వామివారి గ్రామోత్సవం జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు. గ్రామానికి చెందిన బైనా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి దంపతుల సహకారంతో ఆలయానికి పుష్పాలంకరణ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉచ్చూరు రమణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

23న సామాజిక ప్రజావేదిక

సైదాపురం: మండల కేంద్రంలో ఈనెల 23వ తేదీన సామాజిక ప్రజావేదిక సభను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 2020 సంవత్సరం ఏప్రిల్ ఒకటి నుంచి 2022 మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధి పనులకు సంబంధించి సామాజిక బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): గ్రామాల్లో జరుగుతున్న భూముల సర్వే, నివేదికలను అధికారులు ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బాలాయపల్లి మండలంలోని కరిమెనగుంటలో జరుగుతున్న భూముల రీసర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సాదాబైనామా భూముల నమోదులో జాగ్రత్తలు వహించాలని సూచించారు. భూముల రీసర్వేలో రైతుల వద్ద నుంచి ఎంటువంటి అభ్యంతరాలున్నా అధికారులు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్, ఎంపీడీఓ వినీల్ పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి



శ్రీనివాసులు (ఫైల్)

కలువాయి: పొలంలో పనిచేస్తుండగా గుండె పోటు వచ్చి ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందిన విషాద సంఘటన కలువాయి మండలం బ్రాహ్మణపల్లెలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పెరుమాళ్ల శ్రీనివాసులు(35) బుధవారం తన పొలంలో యూరియా చల్లేందుకు ఇంటి నుంచి ఎరువు బస్తాను మోసుకుని పొలానికి వెళ్లాడు. పొలం గట్టున బస్తా దించి, మరో బస్తా తీసుకువచ్చేందుకు బయలు దేరుతుండగా గుండె నొప్పి రావడంతో పొలంలోనే కుప్ప కూలిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లే సరికే శ్రీనివాసులు మరణించాడు. కుటుంబ పెద్ద దిక్కును పోగొట్టుకున్నట్టు వారు ఆవేదన చెందారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి



తహసీల్దార్లతో సమీక్షిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరు: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా అందరూ పనిచేయాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు తదితర అధికారులతో ఆయన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ప్రత్యేక స్పందన కార్యక్రమం ఏర్పాటులో భాగంగానే ఇప్పటికే చిల్లకూరు, కోట మండలాల్లో ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాల్సి ఉందన్నారు. అలాగే ఈ నెల 26వ తేదీన జరుగనున్న గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. చిల్లకూరు మండలంలోని గ్రామ కంఠం భూములకు సంబంధించిన వివరాలను అందజేయాలని చిల్లకూరు తహసీల్దార్‌ను ఆదేశించారు. అలాగే సాదాబైనామా తదితర విషయాలపై ఆయన అధికారులతో సమీక్షించి, పలు విషయాలపై చర్చించారు.

భూ సమస్యలు పరిష్కారానికే రీ సర్వే

డక్కిలి: సమస్యలు పరిష్కారానికే భూముల రీ సర్వే చేపడుతున్నామని, దీన్ని పక్కాగా నిర్వహించాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని డక్కిలి పంచాయతీ కందలవారిపల్లెలో సాదాబైనామా కార్యక్రమంపై బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు డీఎల్‌డీఓ వాణిరెడ్డి, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ కరిముల్లా, డక్కిలి ఎంపీటీసీ సభ్యురాలు మొలకల వెంకటరమణమ్మ, సర్పంచ్ శనగా వేమక్క పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

చిట్టమూరు: మండలంలోని మల్లాం, చిట్టమూరు సచివాలయాలను గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. పలు రికార్డులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు.

అఖిల్‌ను ఆదుకోవడం అభినందనీయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎల్లసిరి, రొటేరియన్లు

గూడూరు: ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన అఖిల్‌ను రొటేరియన్లు ఆదుకోవడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు, రొటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ భవన్‌లో బుధవారం అఖిల్‌కు రూ.70 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్స్ చదివి, ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న అఖిల్ రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లూ చచ్చుపడిపోయాయన్నారు. దీంతో నడవలేక మంచానికే పరిమితమయ్యాడన్నారు. అతని తల్లిదండ్రులకు ఎలాంటి చరస్థిరాస్తులు లేవని, దాతలంతా ముందుకొచ్చి సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. గతంలో రోటరీ వెస్ట్ గూడూరు క్లబ్ ద్వారా కూడా ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ అఖిల్‌ను ఆదుకోవాలని, కోరగానే స్పందించిన రొటేయిన్‌లకు ధన్యవాదాలు తెలిపారు. అధిక మొత్తం ఇచ్చిన మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, నాగసునీల్ అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు దశరథరామిరెడ్డి, మయూరి శ్యాంయాదవ్, బాలకృష్ణరాజు, జీజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు

కండలేరులో 51.398 టీఎంసీలు

రాపూరు: కండలేరులో బుధవారం నాటి కి 51.398 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రేగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 1460 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 50, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిస్‌కు 30, హైలెవల్ స్లూయిస్‌కు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ

పెళ్లకూరు: సంక్రాంతి పండుగల్లో భాగంగా బుధవారం శిరసనంబేడు గిరిజనులకు వేలూరు మురళీకృష్ణారెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. కాలనీలోని సుమారు 200 మందికి పైగా గిరిజనులకు చీరలు, లుంగీలు, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుంటపూడి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

సహపంక్తి భోజనం సంతోషదాయకం



మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు: పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులతో కలసి సహపంక్తి భోజనాలు చేయడం ఎంతో సంతోషదాయకమని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా అక్కడ పనిచేసే పోలీసులు తమ కుటుంబ సభ్యులతో కలసి బుధవారం గెట్ టూ గెదర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో కలసి గెట్ టూ గెదర్‌లో పాల్గొని సహపంక్తి భోజనాలు చేయడం వంటి వినూత్న కార్యక్రమం పోలీస్ అధికారులతోపాటు, సిబ్బందిలోనూ కొత్త ఉత్సాహాన్ని తెచ్చిపెట్టిందన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన, టూటౌన్ సీఐ వెంకటేశ్వరరావును డీఎస్పీతోపాటు, సిబ్బంది కూడా అభినందించారు.

వైభవం.. గొబ్బెమ్మ నిమజ్జనం



దక్కిలి: గొబ్బెమ్మను ఊరేగింపుగా తీసుకెళుతున్న మహిళలు

దక్కిలి: మండలంలోని దగ్గవోలు, భీమవరం, పాతనాలపాడు (కమ్మవారిపల్లె), చాపలపల్లె, సంగనపల్లె తదితర గ్రామాల్లో బుధవారం గొబ్బెమ్మ నిమజ్జనోత్సవం వైభవంగా నిర్వహించారు. కుమ్మరింట తయారు చేసిన గౌరీదేవిని గ్రామంలో వేపాకుతో మండపం కట్టి, గొబ్బెమ్మగా కొలువుదీర్చి విశేషాలంకరణ చేశారు. అనంతరం పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. తరువాత గొబ్బెమ్మను మేళతాళాల నడుమ గ్రామ చావిడి వద్ద కొలువుదీర్చి, పాటలు పాడుతూ సందడి చేశారు. గొబ్బెమ్మ ఊరేగింపులో యువత మేళతాళాల నడుమ నృత్యాలు చేస్తూ చెరువులు వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

సైదాపురం మండలంలో..

సైదాపురం: మండలంలోని తురిమెర్ల, సైదాపురం గ్రామాల్లో బుధవారం గొబ్బెమ్మ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. తొలుత గొబ్బెమ్మకు పూజలు చేసిన తరువాత పురవీధుల్లో తప్పెట్లు, తాళాలు, విచిత్రమైన వేషధారణలతో నృత్యాలు చేస్తూ ఊరేగించారు. అనంతరం ఘనంగా నిమజ్జం చేశారు.

రాపూరు మండలంలో..

రాపూరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో గొబ్బెమ్మ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి. భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు గొబ్బి పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ఊరేగించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.

వాకాడు బీసీ కాలనీలో..

వాకాడు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బుధవారం రాత్రి గొబ్బెమ్మ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కాలనీలో గిరిజనులు గొబ్బెమ్మ ప్రతిమను ప్రతిష్ఠించి, మూడు రోజులుగా పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, జానపద నృత్యాలు ఏర్పాటు చేశారు. గొబ్బెమ్మను గ్రామంలో ఊరేగించి, నిమజ్జనం చేశారు.

వెంకటగిరి మండలంలో..

వెంకటగిరి రూరల్: సంక్రాంతి వేడుకల్లో భాగంగా బుధవారం పలు గ్రామాల్లో గొబ్బెమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని బునపాళెం, వల్లివేడు, అమ్మపాళెం, పాపామాంబపురం, సోమసానిగుంట, కలవలపూడి గ్రామాల్లో గౌరీదేవి ప్రతిమ ఏర్పాటు చేసి, గొబ్బిపాటలతో సందడి చేశారు.

బాలాయపల్లిలో..

మండలంలోని పచ్చారిచేను, యాచవరం, నిండలి, వాక్యం, మన్నూరు గ్రామాల్లో గొబ్బెమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మన్నూరు గ్రామంలో గొబ్బెమ్మ వేడుకల్లో బాలాయపల్లె ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గొబ్బెమ్మ నిమజ్జనంలో పాల్గొన్న మహిళలు



ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



గొబ్బెమ్మకు పూజలు చేస్తున్న భక్తులు